పర్యాటక ప్రాంతాలు కిటకిట


గోల్కొండ కోటలో సందడి చేస్తున్న పర్యాటకులు


చార్‌కమాన్‌-చార్మినార్ రోడ్డులో ..

చార్మినార్: వీకెండ్ అయిన ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చార్మినార్ పరిసరాలలో సందర్శకుల రద్దీ విపరీతంగా కనిపించింది. అఫ్జల్‌గంజ్ దాటి నయాపూల్ మీదుగా మదీనా ద్వారా చార్మినార్ వైపు ముందుకు రావడం..మళ్లీ తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లడం..వాహనదారులకు నరకం కనిపించింది. వాహనదారులకు గుల్జార్ హౌజ్ వరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం తిప్పలు తప్ప లేదు. విధినిర్వహణలో ట్రాఫిక్ పోలీసులున్నప్పటికీ..అధిక సంఖ్యలో వాహనాలు రోడ్డుపైకి రావడంతో ముందుకు వెళ్ల లేక రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. కోట పరిసరాల్లో పర్యాటకుల వాహనాలతో గోల్కొండ సందడిగా మారింది. కోటలోకి ప్రవేశించగానే వారికి గోల్కొండ కోట హిస్టరీ గైడ్స్ స్వాగతం పలికారు. వేలాదిగా తరలివచ్చిన వారితో గోల్కొండలోని బాలాహిసార్ గేట్, క్లాపింగ్‌పోర్టిపో, అక్కన్నమాదన్న కార్యాలయం, ఆయుధాగారం తదితర ప్రాంతాల్లో పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. నగినా బాగ్‌లోని నాగదేవత పుట్ట వద్ద పలువురు మహిళలు నాగదేవతకు పూజలు నిర్వహించి కోటపైకి వెళ్లారు.

సేవా భారతి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నాంపల్లి: సేవా భారతి ఆధ్వర్యంలో ఆదివారం సీతారామ్‌బాగ్‌లోని బైఠక్‌లో మధు మేహ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరాన్ని చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం కొనసాగింది. సమీపంలోని బస్తీలకు చెందిన స్థానిక ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. అలాగే వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. లోథ్ పంచ్ బైఠక్ ప్రతినిధులు ఉచిత వైద్య శిబిరానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


మాట్లాడుతున్న ఛత్రినాక ఎస్సై శ్రీకాంత్

గౌలిపురా: గౌలిపురాలోని గౌలిపురా ఆరె కటిక (సూర్యవంశీ) సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి.నరహరి, ఛత్రినాక ఎస్సై శ్రీకాంత్ పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరహరి, ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యు.యశ్వంత్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్, జి.మహవీర్ ప్రసాద్, జె.బాబురావు, ఎస్.మారుతి రావు, పి.రఘురాం, ఎం.దశరథ్ రాజ్, ఎం.సుభాష్, ఎం.అర్జున్ కుమార్, ఎం.నరేశ్, జి.రాము, ఎస్.శివ పాల్గొన్నారు.

వైభవంగా శీలంకోట్ రేణుకా మాత పూజలు


పూజలు చేస్తున్న ఎస్ఎస్‌కే సమాజ్ ప్రతినిధులు

జియాగూడ: శీలంకోట్ రేణుకా మాత పూజలను వైభవంగా నిర్వహించామని ఎస్ఎస్‌కే సమాజ్ వర్కింగ్ యాక్టింగ్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ నగరి లక్ష్మీనారాయణ్ అన్నారు. ఆదివారం అల్లాదుర్గ్‌లోని శీలంకోట్ రేణుకా మాత ఆలయంలో సోమవంశీయ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారుడు పూజారి రాజేశ్వర్ సొదీ, సభ్యులు బెండు నర్సింగ్ రావు, భరత్‌రావు చౌహాన్, రతన్‌మహేష్, విశ్వనాథ్ ఆనంద్, ఓంకారి ధన్‌రాజ్, హసాజి సురేష్, బచ్చావాలా రాజు, గణేష్ పవర్, నగరి సురేందర్, విశ్వనాథ్ కిషన్, గుడి కమల్ కిశోర్, చౌహాన్ అశోక్, జీత్రి విఠల్ పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ పటిష్టం


సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: తెలంగాణలో గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటు శాతం బాగా పెరిగిందని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం మెహిదీపట్నంలోని జి.పుల్లారెడ్డి కళాశాలలో బీజేపీ నాంపల్లి నియోజకవర్గం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ ఓటు శాతం 14–36కు పెరిగిందని దేశంలో మరే రాష్ట్రంలో ఓటు శాతం ఇంతగా పెరగలేదన్నారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అగ్రస్థానంలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాహుల్‌చంద్ర, చంద్రశేఖర్, యూత్ నాయకులు దేవర వంశీ తదితరులున్నారు.

'హిందూ రాష్ట్ర సాధనకు కృషి చేస్తా'


చంద్రశేఖర్ సింగ్

అబిడ్స్: హిందూ రాష్ట్ర సాధన కోసం గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ కుమారుడు చంద్రశేఖర్ సింగ్ బరిలోకి దిగాడు. కొన్ని సంవత్సరాలుగా ఎమ్మెల్యే రాజా సింగ్ భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా ప్రకటించాలంటూ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రచారాలు నిర్వహిస్తున్నారు. రాజాసింగ్ కుమారుడు చంద్రశేఖర్ సింగ్ ప్రజాక్షేత్రంలోకి దిగాడు. హిందూ రాష్ట్ర సాధనకు తన తండ్రి రాజాసింగ్ కన్న కలలను నిజం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన ప్రకటించారు. ఆదివారం గోవాలో జరిగిన హిందూ రాష్ట్ర మహోత్సవ్ కార్యక్రమంలో చంద్రశేఖర్ సింగ్‌ను ఎమ్మెల్యే రాజా సింగ్ పరిచయం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాను హిందూ రాష్ట్ర సాధన కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

కేసీ గుప్తా సేవలు మరువలేనివి


కేసీ గుప్తా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్, సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్

సుల్తాన్‌బజార్: ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి కొత్త జీవితాలను అందిస్తున్న వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సేవా సంస్థకు బీజం వేసిన కల్వకుంట్ల చంద్రసేన గుప్తా (కేసీ గుప్తా) సేవలు మరువలేవని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. ఆదివారం ఇసామియాబజార్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేసీ గుప్తా విగ్రహాన్ని దయానంద్ గుప్తాతో పాటు సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాసవీ క్లబ్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేసిన గొప్ప వ్యక్తి అని, నేటి తరాలు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా అన్నారు. కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, వాసవీ సేవా కేంద్రం జీవితకాల సలహాదారులు అశోక్‌కుమార్, నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సరాబు లక్ష్మణ్, ఇసామియా బజార్ ఆర్యవైశ్య సంఘం ఎ.రవికుమార్, కోశాధికారి ఎర్రం లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీసీపీ షాకీర్ హుస్సేన్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్

అబిడ్స్: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ షాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లంకల రవికుమార్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు యూనిఫామ్‌లు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రతి ఆటోడ్రైవర్ తప్పని సరిగా యూనిఫామ్‌లు ధరించాలన్నారు. స్కూల్ పిల్లలను నిబంధనల ప్రకారం తీసుకువెళ్లాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా తమ వద్ద డాక్యుమెంట్లు కలిగి ఉండాలన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలి


విద్యార్థులతో పాటు రాఘవేంద్ర, శ్రీరాములు

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టీ దడువై రాఘవేంద్ర అన్నారు. పాత నగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బిట్ల హంస రాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.చంద్రకుమార్, మహిళా మండలి చైర్ పర్సన్ మ్యాడం చంద్రకుమారి తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ నగర్‌లోని ఎస్‌కేవీ బాంకెట్ హాల్‌లో విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీతో పాటు అనాథ విద్యార్థులకు స్కూల్ కిట్ బ్యాగ్స్, మెరిట్ విద్యార్థులకు నగదు అవార్డు.. తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అందజేశారు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య కార్యదర్శి ఫాల్గుణ, మాజీ ట్రస్టీలు ఆకుల పాండు రంగారావు, మందా సూర్యప్రకాష్, డి.ప్రభాకర్‌రావు, బలేపు ఉపేందర్, పల్లె శ్రావణ్, భరత్‌కుమార్, పోసు కృష్ణ, అల్లం భానుమూర్తి, మామిడ్ల నర్సింగ్‌రావు, పల్లే సుశీల్, సురేందర్ పాల్గొన్నారు.



పదవుల కంటే ప్రజా సేవే ముఖ్యం: కౌసర్


మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పదవుల కంటే ప్రజా సేవే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో మజ్లిస్ కార్పొరేటర్, వివిధ డివిజన్ల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. వర్షాకాలంలో ప్రజలు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటారన్నారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు జరిగేలా చూడాల్సిన బాధ్యత మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులదేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్ నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు హారూన్ ఫరాన్, సయ్యద్ రఫత్ హుస్సేన్, జహంగీర్‌బేగ్ తదితరులున్నారు.

పబ్లిక్ గార్డెన్స్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్స్‌లో ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త అబిద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాంపల్లి మాజీ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులను కూడా సమకూర్చారని గుర్తుచేశారు. సాధారణ ఎన్నికలకు ముందే ఓపెన్ జిమ్ ఏర్పాటు జరగాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిందన్నారు. మళ్లీ ఎంపీ ఎన్నికల దృష్ట్యా వాయిదాపడుతూ వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పబ్లిక్‌గార్డెన్స్‌లో సంబంధిత శాఖ అధికారులు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తే నిరుపేదలకు ఇదెంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కామన్ డయాస్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత టి.కనకాచారి రచించిన నీ స్నేహం కోసం పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ మాట్లాడుతూ..కవిగా, రచయితగా, జర్నలిస్టుగా కనకచారి సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి శ్రీ వట్టికోట అల్వార్‌స్వామి స్మారక ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తల్లి రూపశిల్పి జీవీఆర్.చారి, భీమన్న సాహితీ నిధి వ్యవస్థాపకులు హైమావతి భీమన్న, రచయిత్రి శైలజ మిత్ర, రవ్వల కొండ విశ్వబ్రాహ్మణ వేదిక ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటరమణ, కామన్ డయాస్ ప్రధాన కార్యదర్శి టి.రమాదేవి పాల్గొన్నారు.

మోదీ పథకాలతోనే దేశాభివృద్ధి


వేడుకల్లో ముక్క కృష్ణాగుప్తా తదితరులు

అఫ్జల్‌గంజ్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ గోల్కొండ జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా పేర్కొన్నారు. ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా మారడానికి మోదీ ప్రభుత్వమే నాంది పలికిందన్నారు. గండిపేట మైసమ్మ ఆలయం వద్ద కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాగుప్తా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు గుదిబండగా మారిందన్నారు. అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ శాపంగా తయారయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌యాదవ్, రమేష్ రామ్, సంతోష్, ఆధిత్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

యాకుత్‌పురా: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ అన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పురానీహవేలి, సాలార్‌జంగ్ మ్యూజియం, దారుషిఫా ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించి పాఠశాలల విద్యార్థులను పరిమితికి మించి తరలించొదన్నారు. రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సూచించిన ప్రాంతాల్లో ఆటోలు నిలపాలన్నారు.


అవగాహన కల్పిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్

ప్రార్థనలకు వెళ్లిన వృద్ధుడి అదృశ్యం


హమీద్ అల్తాఫ్ షరీఫ్

గౌలిపురా: ప్రార్థనల కోసం వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా మురాద్‌మహల్ ప్రాంతానికి చెందిన హమీద్ అల్తాఫ్ షరీఫ్ (68) గత నెల 28న మధ్యాహ్నం 12.30 గంటలకు శుక్రవారం ప్రార్థనల కోసం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తండ్రి కనిపించడం లేదని ఇస్మాయిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: ప్రీమియర్ ఆసుపత్రి సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని నానల్‌నగర్‌లోని ప్రీమియర్ ఆసుపత్రి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆసుపత్రి ఆధ్వర్యంలో సురంగల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు మూడు దశాబ్దాలుగా వైద్య రంగంలో ఉంటూ తమ ఆసుపత్రి ప్రజాదరణ పొందిందన్నారు. దీనికి తాము ప్రజలకు ఎంతో రుణపడి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజిషియన్ డాక్టర్ కేబీ మూర్తి తన సిబ్బందితో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ సతేందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

'మోదీ మన్‌కీ బాత్'లో బీజేపీ నాయకులు


మన్‌కీ బాత్‌లో కార్పొరేటర్ లాల్‌సింగ్, సోమరాజ్‌సింగ్, నట్రాజ్‌నామ్‌దారి

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన 'మన్‌కీ బాత్'కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కార్పొరేటర్ లాల్‌సింగ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా లాల్‌సింగ్ మాట్లాడుతూ..మోదీ ఆశయ సాధనకు తామంతా కృషి చేస్తామన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నట్రాజ్ నామ్‌దారి, కమల్‌సింగ్, మహేష్ మ్యాదరి, సోమరాజ్ సింగ్, మురళి, అక్షక్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో పెండింగ్ సమస్యలను పరిష్కరించండి


రిజ్వీకి పూల మొక్కను అందజేస్తున్న రహ్మత్ అలీ, దేవులపల్లి శ్రీనివాసరావు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వాణిజ్య పన్నుల ఎన్జీఓ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెహ్మత్ అలీ, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు, అసోసియేటెడ్ అధ్యక్షుడు హరిప్రసాద్ పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి సయ్యద్‌అలీ ముర్తజా రిజ్వీని వారు కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కొంత కాలంగా వేలాది మంది ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే వాణిజ్య పన్నుల శాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ అలీ ముర్తజ రిజ్వీ సానుకూలంగా స్పందించారు. వాణిజ్య పన్నుల శాఖలో ఉన్న సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మధు, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతర కృషి


మీరాలంమండిలో మన్‌కీబాత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చార్మినార్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు జి.హనుమంత్‌రావు అన్నారు. ఆదివారం ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన మీరాలంమండిలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి టీవీలలో వీక్షించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశంలో శాస్త్ర, సాంకేతిక, విద్యా, వైజ్ఞానిక, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఆశించిన ఫలితాలొస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పత్తర్‌గట్టి డివిజన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సంతోష్, నాయకులు అశోక్ గాంధీ, ఆదిత్య, మహమూద్, రాజ్‌కిరన్ పాల్గొన్నారు.

